క్లుప్తంగా

జేసీ పరిశీలన



కోవూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.సేతుమాధవన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వివరాలను పరిశీలించారు. సెక్టోరల్ అధికారులకు శిక్షణ పూర్తయిందా.. వారంతా కేటాయించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారా.. ఎలక్షన్ కమిషన్ సూచించిన మేరకు వసతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అదేవిధంగా వచ్చిన క్లైయిమ్లను ఎప్పటికప్పుడు పారదర్శకంగా పరిశీలిస్తున్నారా.. అనే విషయాలపై కూడా ఆరా తీశారు. ప్రతి బీఎల్వో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో వచ్చిన క్లైయిమ్లను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు ఉన్నారు.

భక్తులకు అన్నదానం



కొడవలూరు : మండలంలోని గండవరంలో ఉదయకశేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో కల్పవృక్ష సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం జరిపిస్తున్నట్లు సొసైటీ ఫౌండర్ ఎస్.సునీతారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జ్యోతి, అపర్ణ, నీలిమ, తులసి పాల్గొన్నారు.

జనసంద్రమైన కాటేపల్లి తీరం



తోటపల్లిగూడూరు : ప్రముఖ పర్యాటక ప్రాంతం కాటేపల్లి సాగరతీరం శనివారం జనసంద్రమైంది. భక్తుల పుణ్యస్నానాలతో పులకించిపోయింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని కాటేపల్లిలోని కామాక్షితాయి సమేత చంద్రశేఖరస్వామి ఆలయానికి శుక్రవారం రాత్రి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో జాగరణ చేశారు. శనివారం వేకువజామున కాటేపల్లి సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తిరుగు పయనమయ్యారు. ఎస్సై జంపానికుమార్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

రామలింగేశ్వరుడికి నంది వాహనసేవ



పొదలకూరు : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొదలకూరులోని కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారు శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు నంది వాహనంపై ఊరేగారు. పొదలకూరు రైతు సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించి కనుల పండువగా గ్రామోత్సవం గావించారు. ఈ సందర్భంగా బాణసంచా, తప్పెట్లు తాళాలతో పట్టణం మారుమోగింది.

స్వామి, అమ్మవార్ల కల్యాణం నేడు

కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరుగుతుందని ప్రధానార్చకుడు ప్రసాద్ స్వామి తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా గిన్నెభిక్ష

పట్టణంలోని కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిదేవుని గిన్నెభిక్ష మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పురవీధుల్లో అర్చకులు గిన్నెభిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చంద్రబాబుకు ఓటేస్తే పథకాలు రద్దు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- ముస్లిం శ్మశాన వాటిక ప్రారంభం



ప్రార్థన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు వలంటీర్ల వ్యవస్థ రద్దవుతాయని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 34వ డివిజన్లో రూ.35 లక్షలతో అభివృద్ధి చేసిన ముస్లిం శ్మశాన వాటికను శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చంద్రబాబు వస్తే దళారీ వ్యవస్థయిన జన్మభూమి కమిటీలను మళ్లీ ఏర్పాటు చేసే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజలు ఆలోచించి తమ విలువైన ఓటును మేలు చేసిన వ్యక్తికి వేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రజలకు ఇచ్చిన మాటను తప్పిన సందర్భాల్లేవని చెప్పారు. నియోజకవర్గంలో చిరస్థాయిలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులను చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్ ఫమీదా, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రియాజ్, కార్పొరేటర్ సత్తార్, మొబీనా, బెజవాడ మేఘనాథ్‌సింగ్, ముస్లిం మైనార్టీ నేతలు కంతర్ అలీ, ఉమర్, ఇస్మాయిల్ ఖాదరీ, దర్గా కమిటీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



నెల్లూరు సిటీ: నియోజకవర్గంలోని 29వ డివిజన్‌కు చెందిన 30 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని ఆహ్వానించిన అనంతరం ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బషీర్, సల్మాన్, గయాజ్, ఖాదర్‌బాషా రియాజ్, నిస్సార్, సవాజ్, షాహీనా, పర్వీన్ తదితరులు పార్టీలో చేరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్, నేతలు కొండా సాయిరెడ్డి, సూరిబాబు, మాజీ కార్పొరేటర్ రావులపల్లి వెంకటజ్యోతి, రావుల అమర్‌నాథ్, దివ్యాంగుల కమిటీ నగరాధ్యక్షుడు రియాజ్ పాల్గొన్నారు.

‘విశ్వభారతి’కి రూ.లక్ష విరాళం



చిన్నారులతో మాట్లాడుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు సిటీ: జీజీహెచ్ సమీపంలోని విశ్వభారతి అంధుల పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి శనివారం అందజేశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని అందజేశామని ఆయన చెప్పారు. అనంతరం పిల్లలతో మాట్లాడి వారి బాగోగులను ఆరాతీశారు. నిర్వాహకురాలు ప్రభావతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, ఏసునాయుడు, ఏఎంసీ డైరెక్టర్లు జీవన్‌ప్రసాద్, తాటిపర్తి వెంకటేశ్వర్లు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించేలా పెద్దలు ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెస్సెమ్‌ఈ రాష్ట్ర డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్): గుంటూరు జిల్లా చేబ్రోలు వద్ద విధుల్లో ఉండగా గుండెపోటుకు గురై గుంటూరు సీసీఎస్ ఎస్సై డేవిడ్‌దాస్ మృతి చెందారు. ఏపీ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీహరి, జిల్లాకు చెందిన పలువురు పోలీస్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గూడూరులోని గాంధీనగర్‌కు చెందిన డేవిడ్‌దాస్ జిల్లాలో పనిచేశారు. ఆయన అంత్యక్రియలను గూడూరులో ఆదివారం నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మూలస్థానేశ్వరుడి రథోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలాపేట, రాజావారివీధి, పల్లెమిట్ట, చాముండివారితోట, శివాలయం, కొండదిబ్బ, బ్రాహ్మణ వీధి, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నవబాలదుర్గాదేవి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శివగిరికాలనీ, రాజీవ్ గృహకల్ప, సాయినగర్, ఇరుగాళమ్మ సంఘం తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నెల్లూరు(బృందావనం): వనంతోపు సెంటర్ సమీపంలోని నర్సరీలో మహిళా దినోత్సవాన్ని నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి, సుధా మురళి, చేజర్ల వినయ, డాక్టర్ శైలజా ఏకాంబరాన్ని సత్కరించారు. నగరాధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు సుభద్రాదేవి, అరుణ, సయ్యద్ నజ్మా, గాయత్రి, డాక్టర్ సుహాసిని, భారతి, ప్రసన్నలక్ష్మి, సుందరి, లలిత, ఇందిర, శ్రీవత్సల తదితరులు పాల్గొన్నారు.

నారీశక్తి ఫిట్‌నెస్ రన్



సర్టిఫికెట్లు అందుకున్న వారితో నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సుస్మిత నర్సింగ్ స్కూల్ విద్యార్థులతో నారీశక్తి ఫిట్‌నెస్ రన్‌ను నెహ్రూ యువ కేంద్ర సౌజన్యంతో సీపీ అండ్ పీహెచ్‌పీడబ్ల్యూఏ, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన లక్ష్మి, రూప, పావనికి టీషర్ట్, క్యాప్, మగ్గులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ నేతలు వేణుగోపాల్, శేషయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఉద్యోగుల సంబరాలు



నెల్లూరు(దర్గామిట్ట): వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఏళ్లుగా పనిచేస్తూ ప్రస్తుతం రెగ్యులరైన ఉద్యోగులు కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో సంబరాలను శనివారం జరుపుకొన్నారు. నియామక పత్రాలను అందుకోనున్న 115 మంది హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఏపీజీఈఏఫ్ జిల్లా చైర్మన్, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి తదితరులు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సుతో ఉద్యోగులను క్రమబద్ధీకరించారని చెప్పారు. అనంతరం ఉద్యోగులను హంస అసోసియేషన్లోకి ఆహ్వానించారు. హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్‌కిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ శేషగిరిరావు, జిల్లా ఉపాధ్యక్షులు మురళి, జలీల్ అహ్మద్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ఏపీజీఈఏఫ్ జిల్లా కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షులు మల్లికార్జున, ఖలీల్, సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆదిదంపతుల కల్యాణోత్సవాలు



ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో..



కాశీనాయన ఆశ్రమంలో..



నాగేశ్వరస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో ఆదిదంపతుల కల్యాణోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై వీక్షించి తన్మయత్వం చెందారు.

- సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉమామహేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి ఏకాంతసేవను వేడుకగా జరిపారు. ఉభయకర్తలుగా పెనుగొండ వెంకటచలమయ్య, మంజుల దంపతులు, మహాలక్ష్మీబాయి, గోపాల్‌సింగ్, కృష్ణసింగ్ వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, ధర్మసింగ్, ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.
- వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు 32 వంటకాలతో అన్నప్రసాదాన్ని అందజేశారు. బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు మువ్వా ప్రసాద్, ధర్మసింధు సేవా సమితి నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, మహేష్, వెంకటేశ్వర్లునాయుడు, నాగూర్, కృష్ణ, గణేష్, సిద్ధూ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
- సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో గల ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు

ఎమ్మెల్సీకి సత్కారం



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు.

అవాస్తవాల ప్రచారం తగదు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంపై కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రచారాలు అవాస్తవమని ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. దేవస్థానంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. దేవస్థానానికి సంబంధించిన భూమి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ క్రమంలో కొందరు పనిగట్టుకొని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఓ అర్చకుడు తొందరపాటుతో చేసిన వ్యాఖ్యలపై చట్ట ప్రకారం చైర్మన్, సభ్యులతో కలిసి నోటీస్‌ను అందజేసి వివరణ కోరామని, తన పొరపాటును ఆయన అంగీకరించారన్నారు.

వేడుకగా మీనాక్షి సుందరేశ్వరుడి కల్యాణం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమాన్ని జరిపారు. అనంతరం గజవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆల్తూరి సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక దంపతులు వ్యవహరించారు. రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎముకలు, కీళ్ల వ్యాధులపై డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, శశాంక్ అవగాహన కల్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాజు, స్వర్ణా రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, చింతల అమరేంద్రరెడ్డి, డిస్ట్రిక్ట్ 203 మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి తరలిరండి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఆర్యవైశ్యుల ఐక్యతను చాటేందుకు గానూ ఈ నెల 17న నిర్వహించనున్న ఆర్యవైశ్య అభినందన ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని నేతలు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలకు తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో పూజలు చేయించి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విజయమహల్ గేట్ సమీపంలోని ఎమ్వీఎస్ కల్యాణ మండపంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన 61 మంది ఆర్యవైశ్య ప్రముఖులను సత్కరించనున్నారని పేర్కొన్నారు. రంగనాథస్వామి, సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్లు మంచికంటి శ్రీనివాసులు, చందోలు సతీష్‌కుమార్, కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి చీదెళ్ల కిషన్, సాయి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, చలువాది శరణ్, సరాబు సుబ్రహ్మణ్యం, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(బారకాసు): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ హాల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను నెల్లూరు నగర నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం పరిశీలించారు. వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. డీఆర్వో లవన్న, ఆర్డీఓ మలోల, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మీ వెంటే మేము..



ఆదాలతో దొంతాలి వాసులు

నెల్లూరు సిటీ: ఒకరు పార్టీ మారినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదని, మీ వెంటే మేమున్నామని దొంతాలి గ్రామస్తులు పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయానికి దొంతాలి గ్రామస్తులు శనివారం భారీగా తరలివచ్చి తమ మద్దతును ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబుయాదవ్, మస్తానయ్య, నేతలు శేఖర్, సురేష్, వెంకటేశ్వర్లు, రామయ్య, బెల్లంకొండ వెంకయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాల ఆవరణలో మొక్కలను మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శనివారం నాటారు. నగరంలో నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశానికి రేణిగుంట నుంచి వస్తూ మార్గమధ్యలో పెద్దాస్పత్రి వద్దకు వారు వచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సీట్లు కేటాయించరూ..



ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): జిల్లాలో బీసీలకు ఎమ్మెల్యే సీట్లను టీడీపీ కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బీసీలకు ఒక్క సీటును సైతం కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా బీసీ సంఘాలు మేల్కొని సీట్లు కేటాయించని పార్టీపై ఉద్యమం చేయాలని కోరారు. జేఏసీ నేతలు పవన్, దినేష్, నానీ, కిషోర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.